
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# బంధం

సంక్రాంతి పండక్కి అమ్మా, నాన్నలదగ్గరకి వెళ్తున్న ఆనందంలో హుషారుగా రైలెక్కింది మహతి. బెంగుళూరు నించి కాకినాడ వెళ్ళే శేషాద్రి ఎక్స్ ప్రెస్, మిగతా ట్రెయిన్ అంతా కిట కిటలాడుతున్నా, ఏ.సీ టూ టయర్ బోగీ నిశ్శబ్దంగానే ఉంది, అప్పుడప్పుడూ వినిపిస్తున్న ఒక పెద్దాయన దగ్గు తప్ప.

అప్పటికే బెంగుళూరు సిటీ స్టేషన్ లో ఎక్కిన పాసెంజర్స్ తమ సామాన్లు సర్దుకుని కూర్చున్నారు. తన సీట్ నెంబర్ చూసుకుని కూర్చుంది. ఏ.సీ టూ టయర్ లో కింద బెర్త్ అంటే చాలా ఇష్టం మహతికి. పైది కూడా వాల్చుకుంటే ఎంతో విశాలంగా ఇంట్లో మంచం మీద పడుకున్న భావన, చెప్పుల్లోంచి కాళ్ళు తీసి పైకి మడతపెట్టుకుని సర్దుకుని కూర్చుంటూ చుట్టూ చూసింది.

దగ్గుతున్న పెద్దాయన తనకెదురుగానే ఉండడాన్ని గమనించింది. ' అయ్యో రాక, రాక ఇక్కడే రావాలా నాకు సీటు? " అనుకుంది విసుగ్గా.

ఆమెకి గొడవ పడదు, తనకి నచ్చిన పుస్తకం చదువుకుంటూనో, లేకపోతే లాప్టాప్ లో సినిమా చూసుకుంటూనో ప్రశాంతంగా ప్రయాణం చెయ్యడం అంటే ఇష్టం. అదీ కాకపోతే హాయిగా పడుకోవడం ఇంకా ఇష్టం.

" నీకు శలవు ఉన్నప్పుడు నాకోసం ఆగడం ఎందుకురా? నువ్వు ముందు వెళ్ళు, నాలుగురోజులాగి నేనొస్తాగా! " చాలారోజులయింది ఊరెళ్ళి, అమ్మా నాన్నలని చూసి, అందుకే భర్త ప్రశాంత్ మాటలకి ఒప్పుకుని తను ముందు బయలుదేరింది.

పండగ మూలంగా రష్ గా ఉంది రైలు. ఇంక ప్రశాంతత కూడానా? అనుకుంది. "ఇంకా నయం, ఏడ్చి, అల్లరి చేసే చిన్నపిల్లలు లేరు దగ్గరలోఅంతవరకూ నయమే!" అనుకుంది.

పిల్లలంటే అమ్మ గొడవ గుర్తొస్తుంది.." ఇంకా ఎన్నాళ్ళే? ఏ వయసుకు జరిగే ముచ్చట ఆ వయసులో జరగాలి! మాకూ ఓ మనవడినో, మనవరాలినో చూసుకోవాలని ఉండదూ! అసలుకంటే వడ్డీ ముద్దు తెలుసా! ఆ బంధంలోని అందమే వేరు తల్లీ! నా మాట విను"అంటూ పోరు పెడుతుంది. ' అబ్బా! ఊరుకో అమ్మా! అంటుంది తను.

రాజమండ్రి దగ్గర పల్లెటూరు తమది, సంక్రాంతి అందాలు, సంబరాలు అన్నీ మధురమైనవే. తలుచుకుంటేనే మనసు చిన్నతనంలోకి పరిగెత్తి పులకరిస్తుంది.

"ఈ చదువులు, ఉద్యోగాలు వచ్చి ఎన్ని మిస్ అవుతున్నారో? పిల్లలు!" అమ్మ తరచుగా అంటూనే ఉంటుంది.

అలా ఆలోచనల్లో తేలుతూనే ఎదురుగా ఉన్న వారిని చూసింది మళ్ళీ.. తనది కాక లోపలవైపున్నమిగిలిన మూడు సీట్లలో కూర్చుని ఉన్నారు వాళ్ళు ముగ్గురూ. చాలా సాంప్రదాయ బద్ధమైన కుటుంబంలా ఉన్నారు.. బాగా పెద్దాయన, ఆయన కొడుకూ, కోడలు లా. పెద్దాయన కి ఎనభై పైనే ఉంటాయి, ఆయన కొడుకుకి అరవై దాకా ఉంటాయేమో, ఆవిడకి అరవైలోపుండవచ్చు. మగవాళ్ళిద్దరూ గోచీ పెట్టుకుని పంచలు కట్టుకుని ఉన్నారు, పెద్దాయన పైమీద ఉత్తరీయం తప్ప లాల్చీ కూడా వేసుకోలేదు. కొడుకు మాత్రం లాల్చీ వేసుకుని పైన చక్కగా మడిచిన కండువా వేసుకున్నారు. ఇద్దరి చెవులకీ రాళ్ళపోగులు. నుదిటిన కుంకుమ బొట్లు. ఆవిడ ఎర్రటి చీర కట్టుకుని, నుదుటన పెద్ద బొట్టుతో కళగా ఉన్నారు.పెద్దాయన పడుకునే ఉన్నారు.

ఆయనకి ఉండుండి దగ్గు బాగా వస్తోంది. " నాన్నా, జాగ్రత్త! మెల్లిగా!" అంటున్నారాయన కొడుకు. పదిరోజులనించీ పెద్దాయన్ని తీసుకుని ఊర్లన్నీ తిరుగుతున్నారుట, ఆ అలసట అందరి ముఖాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. .

" అబ్బాయి సంధ్యవార్చాడా? చీకటి పడటం లేదూ!?" అంత దగ్గులోనూ పెద్దాయన ప్రశ్న.

" ఇదిగో వెళతారుట, కాసేపట్లో తిరుపతి స్టేషన్ వస్తోంది! అక్కడ కానిస్తానన్నారు"

" మన మంచినీళ్ళున్నాయి కదూ!" అన్నారాయన

" ఉన్నాయి, ఇవ్వనా?తాగుతారా?" ఆవిడ అడిగింది.

" అబ్బే నాక్కాదు, వాడి సంధ్యకి, అక్కడవి, ఇక్కడవి నీళ్ళెందుకు? అని" అన్నారయన.

"! ఊరుకోండి నాన్నా! నేను చూసుకుంటాగా అవన్నీ!" రవ్వంతే విసుగు కొడుకు గొంతులో.

" విసుక్కుంటాడేవిటమ్మా! వాడికోసమేగా!" ఆపై మాట రాకుండా దగ్గుతెర కమ్ముకు వచ్చింది.

" పరవాలేదు మావయ్యగారు, ఆయన సంగతి మీకు తెలియనిదేముంది, అన్నీ చేస్తారు. మీరు మంచినీళ్ళు తాగుతారా?" అందావిడ.

" వద్దమ్మా! తగ్గుతుందిలే! లేచి కూర్చోనా కాసేపు! వాడు సంధ్య వార్చేదాకా! నన్ను దిగద్దంటాడుగా!" అన్నారాయన.

" మహాప్రభో! మీరు దిగడం కూడానా? రాత్రి పడుక్కు లేస్తే ఇంటికెళ్ళిపోతాం, అప్పుడన్నీ వార్చుకోవచ్చు" అన్నారాయన కొడుకు.

"అలా అంటారేం? మనమే కదా తీసుకొచ్చాం! వద్దంటే ఆయన గొడవ పెట్టేవారా? వెళ్ళండి, చీకటి పడేలోపు మీ కార్యక్రమం ముగించుకుని రండి !" అంటూ చిన్న వెండి పంచపాత్ర, ఉద్ధరిణే, పళ్ళెం భర్త చేతికిచ్చిందావిడ. కన్ను మూసి తెరిచేలోగా ఆయన పై లాల్చీ విప్పి ఆవిడ చేతికిచ్చి విజయవాడ లో రైలాగ్గానే ప్లాట్ ఫార్మ్ మీదకి పరిగెత్తారు. మరో పది నిమిషాలకి తిరిగొచ్చి అవి రెండూ ఆవిడ చేతికిచ్చి తిరిగి లాల్చీ వేసుకున్నారు.

వీళ్ళ మాటలు, చేతలు అన్నీ చాలా కొత్తగా అనిపించాయి మహతికి. పుట్టి బుద్ధెరిగాకా పండితులని చూసింది కాని ఇంత నియమంగా ఇంకా ఉన్నారా? అని ఆమెకాశ్చర్యం.

ఈలోపున ఎదురు పక్కన కూర్చున్న ఆవిడ పెద్దాయన కోడలితో మాటలు కలిపింది. ఆవిడ ద్వారా విన్న విషయాలు చూస్తే మరింత ఆశ్చర్యం వేసింది మహతికి.

పెద్దాయనకి తొంభై ఏళ్ళుట. గోదారొడ్డునే పుట్టారు, అక్కడే పెరిగారు. వేదవేదాంగాలు అధ్యయనం చేశారు. మహా పండితుడిగా పేరుపొందారు. సంస్కృతాంధ్రభాషల్లో ఎంతో ప్రావీణ్యత ఉన్నవారు. ఆయన కొడుకు కూడా తండ్రి అడుగుజాడల్లోనే సంస్కృత పండితుడై వేదపాఠశాలకి అధిపతిగా ఉన్నారుట.

"జీవితమంతా గోదారమ్మ ఒళ్ళో చల్లగా గడిచింది, పోయేలోపు గంగమ్మనొక్క సారి చూడాలనుందిరా!" అని తండ్రి తన తొంభైయవ పుట్టినరోజున కోరితే కాదన్లేక ఈ ప్రయాణం తలపెట్టారుట.

"ముందు ఎంతో ఆలొచించామండి, ఆయన వయసొకటే కాదండి, అలవాట్లు కూడా. ఇంటి భోజనం తప్ప మరేమీ తినరండి. మా అత్తగారున్నప్పుడు ఆవిడ మడి కట్టుకుని వండేవారు, ఆవిడ పోయిన తర్వాతే నేను మడివంట మొదలుపెట్టాను, అంతకు ముందు ఆవిడ చేతికింద సహాయమే. పిల్లల పనులు, స్కూళ్ళు ఇవే నాకు. కాఫీ, టీలన్నవే ఎరగరు. పొద్దున్నే లేచి స్నానం, నిత్యపూజ, దేవతార్చన. ఆపైనే భోజనం. పొద్దున్న తింటే మాళ్ళీ రాత్రే ! తిధివారాల్ని భోజనమో, ఫలహారమో. మధ్యాహ్నం ఓ గ్లాస్ మజ్జిగ. అంతే! బయట మంచినీళ్ళు కూడా తాగరు ఇన్నేళ్ళబట్టీ కూడా అంతే!" అని ఆవిడ చెప్తుంటే మహతీ, ఆ పక్క సీట్లలోని భార్యాభర్తలు ఎంతో ఆశ్చర్యంతో విన్నారు.

"మావారైనా అంతే! ఎప్పుడూ ఎక్కడా ఏమీ తినరు మరీ అంత అవసరమైతే తప్ప! "అన్నారావిడ.

" మీ పిల్లలు కూడా సస్కృతం చదువుకున్నారా?" అసంకల్పితంగా అడిగింది మహతి.

నవ్విందావిడ. " లేదమ్మా! వాళ్ళీకాలపు వాళ్ళయిరి. నేర్చుకున్నారు కానీ ఇదే వృత్తిగా చేపట్టమన్నారు, అదే మా మావయ్యగారి బాధ. కానీ ఏం చేస్తాం? పిల్లల ఇష్టాల్ని కాదనలేకపోయాం. మా అమ్మాయికి క్రిందటేడాది పెళ్ళి చేశాం. ఇక్కడే బెంగుళూరులోనే ఉంటుంది, నీ వయసే ఉంటుందేమో దానికి. "అందావిడ.

ఒక అబ్బాయి బొంబాయిలోనూ, మరో అబ్బాయి అమెరికాలోనూ ఉంటారుట. తాతగారినెలాగైనా అమెరికా తీసుకుని వెళ్ళాలని మా వాడి కోరిక. చిన్నప్పటినించీ వాళ్ళ దగ్గరే పెరిగారు కదా! ఎంత ప్రేమో వాళ్ళందరికీ తాతగారు, మామ్మగారలంటే " అందావిడ

" భలేవారమ్మా! మొత్తానికి ధైర్యమే మీకు, మీవారికి. ఆ తొంభైఏళ్ళాయన్నేసుకుని తీర్ధయాత్రలకెళ్ళడానికి! ఎంత బలహీనంగా ఉన్నారాయన, ఆ వెన్నెముక పుటుక్కున విరిగిపోతుందేమో అన్నట్టుగా ఉంది" అన్నాడా పక్క దంపతుల్లోని భర్త.

" మనదేముందండి? భగవంతుడి సంకల్పం. అది గట్టిగా ఉంటే అన్నీ జరిగితీరతాయి. పోయి ఎక్కడున్నారో ? మహా ఇల్లాలు మా అత్తగారు ఎప్పుడూ అదే అనేవారు. ' రాక పోకలు మన ఇష్టంటే? ఆ పైవాడున్నాడు చూశావా? వాడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు" అని.. ఇట్టే వెళ్ళిపోయారు " అందావిడ కనుకోలకుల్లో నీటిని తుడుచుకుంటూ పోయిన అత్తగారిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

మాటలు రానట్టు వింటోంది మహతి.

కాశీ, హరిద్వార్, ప్రయాగ ఇవన్నీ తిరిగారుట, అక్కడనించి బెంగుళూరులో అమ్మాయి దగ్గరకొచ్చి రెండు రోజులుండి ఇప్పుడు తిరుగుప్రయాణం. తాతగారిని చూడడానికి బొంబాయి మనవడు బెంగుళూరు వచ్చాడుట. తనొక్కడే, అక్కడెక్కడో ఉండిపోయాడని రెండోవాడు ఉడుక్కున్నాడుట..

“ఎంత అందమైన బంధం ఆ కుటుంబానిది? కనిపించని దారంలా అందరినీ సున్నితంగా ఎలా కలిపి ఉంచింది! ఈవిడ ఎంత మంచిది?” అనుకోకుండా ఉండలేకపోయింది మహతి.

" పిల్లలు దూరం వెళ్ళాకా అర్థమవుతోంది మాకు ఆ బాధ ఎలా ఉంటుందో! ఎప్పుడైనా ఈయనో రెండురోజులు బయటకెళితే ఎంత గొడవ పెట్టేవారో? మా అత్తగారు! మావయ్యగారైతే ఇప్పటికీ అదే తీరు. ప్రతీ ఏడు మా చెట్టు కాచే మొదటి మావిడి పండు ప్రత్యేకంగా ముగ్గించి కొడ్డుక్కిస్తారు. ఇద్దరికీ యజ్ఞోపవీతాలు స్వయంగా తయారుచేస్తారు. ఇలాంటివే ఎన్నో!” ఆవిడ కంఠంలో చెప్పలేనంత తృప్తి, రవ్వంత గర్వం వినిపించాయి మహతికి.

“అన్నీ బాగానే ఉన్నాయి కానీ ఏమీ తినకపోతే ఎలా? నీరసించిపోరూ? ఇందాకటినించీ విపరీతంగా దగ్గుతున్నారు కూడా “ పక్కసీటాయన.

" అదొక్కటే ఆలోచిస్తున్నాము! మా అమ్మాయింట్లో నేను మడిగా చేసినవే, తిననంటున్నారు ఇందాకటినించీ అడుగుతున్నారు మావారు" అంది.

పెద్దాయన కళ్ళు మూసుకుని పడుకున్నారు, వింటున్నారో, నిద్రపోయారో తెలీటం లేదు ఎవరికీ..

“ఏ.సీ కొంచం తగ్గించమని చెప్పనా? మరీ పైన చొక్కా కూడా లేదుగా?” అన్నారాయన.

“మా ఒక్కరికోసం చెప్తే మిగతావారికి ఇబ్బంది కదండీ! శాలువా కప్పుతాను” అంటూ తండ్రి కి శాలువా కప్పారాయన. ఇలాంటి పరిస్థితుల్లో కూడా పక్కవారి సౌకర్యం గురించే ఆలోచిస్తున్న ఆయన్ని అభిమానంగా చూసింది మహతి.

అప్పటికి సమయం ఏడుగంటలు దాటింది, రెండు సార్లు కరక్కాయ పొడి పటికబెల్లం పొడితో కలిపి ఇచ్చిందావిడ, పెద్దాయన వద్దన్నారు. “పరవాలేదు మన ఇంటి పొడే! “అంటూ ఇచ్చారు. కొద్దిగా మంచినీళ్ళు తాగారు.

అప్పటినించీ మొదలు. చంటి పిల్లాడికి చెప్పినట్టు ఇద్దరూ ఆయనకి ఏదైనా తినమని చెప్పడం.. ఆయన వద్దనడం..

' కొద్దిగా పులిహోర, మీ కోడలు చేసినదే!" ఆయన మాట్లాడలేదు.. వద్దన్నారని అర్థం అయింది.

" పోనీ ఓ అరటిపండో?"

“వద్దు, రేపు ఇంటికెళ్ళాకా తింటాను”

' మనం ఇంటికెళ్ళి మీ పూజా, ఆవిడ వంట అయ్యేసరికి పన్నెండవుతుంది. అప్పటివరకూ ఎలా?" అన్నారాయన కొడుకు.

" పర్వాలేదు,నాకేమీ అవదు" అంటారాయన.

" పోనీ స్వీట్ తినకూడదూ.” .ఆవిడ

"నువ్వేమిటమ్మా సరస్వతీ వాడిలాగే మాట్లాడతావు.. కొట్లో కొన్నది ఎప్పుడైనా?” అంటూ తప్పన్నట్టుగా ముక్కుమీద వేలుంచుకున్నారు..

' అమ్మాయి చెప్పింది పోనీ కొద్దిగా వేడి పాలల్లో కార్న్ ఫ్లేక్స్ వేసుకుని తింటారేమో. మీరు మెల్లిగా అడగండి” " అందావిడ భర్తని.

తండ్రిని మెల్లిగా లేపి కూర్చోబెట్టి నెమ్మదిగా బ్రతిమాలాడడం మొదలు పెట్టారాయన.

' రైలు దిగి ఇంటికి వెళ్ళాలన్నా ఓపిక ఉండద్దూ, మీరిలా చిన్నపిల్లాడిలా హఠం చేస్తే ఎలా? ఓపిక ఉన్నన్నాళ్ళూ అన్ని నియమాలూ పాటించారుకదా నాన్నా! మా మాటవిని ఏదో ఒకటి" అంటున్న ఆయన మాటలకి బోసినోటితో నవ్వి మళ్ళీ ముక్కుమీద వేలుంచుకున్నారు తప్పన్నట్టు.

" ఇది పాపే ఇచ్చింది మావయ్యగారు. మొక్కజొన్న పేలాలాంటివి, ఫ్లాస్క్ లో వేడి పాలున్నాయి, ఒక్క అరకప్పు పాలల్లో కొద్దిగా వేసి ఇస్తాను. అంటు కాదు, తప్పు లేదు" అందావిడ..

ఆయన మాట్లాడకుండా కిటికీలోంచి బయటకి చూస్తున్నారు. కళ్ళల్లో నీరసం తెలుస్తోంది. దగ్గి దగ్గి ఊపిరి బరువుగా వస్తోంది, కొద్దిగా ఆయాసం ఉన్నట్టుగా దొక్కలెగురుతున్నాయి.

మనవరాలు ఇచ్చింది అనగానే, ఒక్కసారి కార్న్ ఫ్లేక్స్ పొట్లం వైపు, ఫ్లాస్క్ వైపు చూశారు. అది చూడగానే ఆవిడ ముఖం విప్పారింది.

" కొద్దిగా ఇవ్వనా?" అందావిడ ఆశగా.

ఆయన మౌనంగా మళ్ళీ తల కిటికీకి ఆనించుకున్నారు. కొడుకూ, కోడలు ముఖ ముఖాలు చూసుకున్నారు.

" వద్దు, తప్పు" అన్నారు.

"తప్పు లేదు నాన్న!" అన్నారాయన కొడుకు.

"మనవడింటికి అమెరికా వెళతానన్నారు మరి?" అందావిడ అధాట్టుగా. అదే ఆవిడ అమ్ముల పొదులో ఆఖరి అస్త్రం అన్నట్టుగా.

నీరసపడిఉన్న పెద్దాయన కళ్ళల్లో తళుక్కున వచ్చింది వెలుగు క్షణం సేపు..

" అమెరికాయే!" దగ్గి దగ్గి బొంగురు పోయిన గొంతుతో అన్నారాయన.

" మరి? మన ముగ్గురికీ పాస్ పోర్ట్ లు చేయిస్తున్నాడుకదా" అందావిడ..

"పాస్ పోర్ట్ లా?" గొణిగారు..

" మనం అమెరికా వెళ్ళాలంటే పాస్ పోర్టు, వీసా లు ఉండాలి కదా! మీరిలా ఇక్కడికే నీరసపడితే అమెరికా ఎలా వెళదాం? మనవరాలి ఇల్లు చూశారు, మనవడి ఇల్లు చూడరూ? మీ పేరింటిగాడు కూడా!" అందావిడ గబ గబా.

' అంచాత, నా మాట విని " అంటున్న భర్త చేతిలో ఒక కప్పులో కొద్దిగా పాలు, దాంట్లో కాసిని కార్న్ ఫ్లేక్స్ వేసి పెట్టేసిందావిడ అప్పటికే

" తిన్నా?" అన్నారాయన సందేహంగా.

తప్పకుండా తినాలి, లేకపోతే ఎలా? అన్నీ సక్రమంగా పూర్తయితే వైశాఖ మాసానికి విమానం ఎక్కుదాం మరి "అన్నారాయన తండ్రి నోట్లో పాలు కార్న్ ఫ్లేక్స్ పెడుతూ.

"సరే అయితే !" అంటూ నాలుగైదు చెంచాలు తిన్నారాయన.

ప్రపంచాన్ని జయించిన తృప్తి ఆయన కొడుకూ, కోడలి ముఖాల్లో..

"అదీ! ఇప్పుడు శాలువా కప్పుకుని కూర్చోండి మరి! అన్నారాయన తండ్రి మూతి తన ఉత్తరీయంతో తుడుస్తూ.. ఆయన వెనక తలగడ సరిచేసి పెట్టిందావిడ.

పక్కన కూర్చున్న మిగతా ముగ్గురితో సంబంధం లేనట్టుగా వాళ్ళలోకంలో వాళ్ళున్నారు.ఇదంతా చూస్తుంటే ఎక్కడో తెలియకుండానే ఏదో కదిలిన భావన మహతి మనసులో.

అర్థమవుతున్న అమ్మ మాటలా పిల్ల మదిలో..

Click here to share your comments on this story

●●●